క్లుప్తంగా

నేడు బొగ్గులకొండ తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని బొగ్గుల కొండ వద్ద వేంచేసి ఉన్న యోగ ప్రసన్నాంజనేయ స్వామి 48వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తాళ్ల శివశంకరరెడ్డి గురువారం తెలిపారు. అర్చకులు ప్రసాద్ శర్మచే ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన, ప్రత్యేక పూజలు అలంకరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచే అన్న సంతర్పణ భారీ ఎలక్ట్రిక్ ప్రభతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కూకట్లపల్లి గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని చైర్మన్ కోరారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఈపురుపాలెం పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీ సూచించారు. ఈపురుపాలెంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మనాభునిపేట, గాంధీపార్కు, సీతారాంపేట, నలబై ఇళ్లు, ఇందిరానగర్, భావనారుషిపేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్మూలన చేపట్టారు. ఎండలు విపరీతంగా కాస్తున్నందున తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ ప్రజలకు సూచనలందించారు. నివాస గృహాల నుంచి వచ్చే చెత్తను, మురుగునీటిని రోడ్లపైకి రాకుండా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు పరీక్ష

అద్దంకి: పట్టణంలోని శింగరకొండ సమపం లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి ఐదో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ గాయత్రి గురువారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఏప్రిల్ 13వ తేదీ నుంచి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుచి 4.30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్, ఏదైనా ఒక గుర్తింపు కార్డువెంట తీసుకుని పరీక్షకు రావాలని కోరారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త

చీరాల టౌన్: ఎండలు అధికంగా కాస్తున్నందున పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యులు పావని సూచించారు. గురువారం బోయినవారిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 53 గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 12 దూడలకు డీవార్మింగ్ రాకుండా మందులు వేశారు. పశువులు ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సేవలతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. పశుపోషకులు యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు పాల ఉత్పత్తి పెరిగేలా పోషక విలువలు కలిగిన దాణా పశువులకు అందించాలన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

చీరాల అర్బన్: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ జె.సరళ గురువారం తెలిపారు. ఈనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఆదివారం ఈస్టర్ పండుగ కావడంతో పరీక్షను ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

అద్దంకి రూరల్: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొట్టిన సంఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని కొంగపాడు గ్రామానికి చెందిన కరి నాగేశ్వరరావు, సాంబశివరావు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై అద్దంకి వచ్చే క్రమంలో పట్టణంలో నామ్ రహదారిపై ఒంగోలు నుంచి వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కేజీబీవీలకు వసతి గదుల మంజూరు

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం బడిబయట ఉన్న డ్రాపౌట్ బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయానికి వసతి గదులు మంజూరైనట్లు ఎస్ఎస్ఏ ఏఈ షేక్ రాజన్‌బాబు గురువారం తెలిపారు. బల్లికురవలోని కేజీబీవీకి 6 వసతి గదులకు రూ. 1.64 కోట్లు సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు కేజీబీవీలో 6 గదులకు రూ. 1.59 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. శుక్రవారం భూమి పూజతో పనులకు శ్రీకారం చుట్టనున్న జేఈ తెలిపారు.

పిల్లలు బడిలో ఉండాలి

అద్దంకి రూరల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ బూదాటి సుధాకరరావు అన్నారు. గురువారం అద్దంకి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు.. క్యాంపెయిన్ నిర్వహించారు. స్థానిక గుంజివారిపాలెం, గానుగపాలెం లోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండల్లో జర భద్రం

- వేటపాలెం మండలంలో ప్రబలుతున్న ఆటలమ్మ
- మూఢ నమ్మకాలతో అశ్రద్ధ చేయకూడదంటున్న వైద్యులు



ఆటలమ్మ సోకిన వ్యక్తి

వేటపాలెం:

వేసవిలో పొంచి ఉన్న ప్రమాదాలతో చిన్నా పెద్దా తేడా లేకుండా భయపడిపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఆటలమ్మ (చికెన్‌పాక్స్), గవద బిళ్లల వంటి వ్యాధులు వేటపాలెం మండలంలో వెలుగు చూస్తున్నాయి. చికెన్‌ఫాక్స్ వ్యాధి లక్షణాలు విస్తృతమయ్యాయి. గవద బిళ్లలు కనిపిస్తున్నాయి. వేటపాలెం, దేశాయిపేటతో పాటు గ్రామాల్లో అనేక మంది చిన్నపిల్లలు ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. దీంతో చిన్నారులను వారి తల్లిదండ్రులు స్థానిక వైద్యశాలలకు తరలిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ వ్యాధి ఎలా వస్తుంది?

చికెన్ ఫాక్స్ అనేది వరిసెల్లా జోస్టర్ అనే వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఇది ఎక్కువగా పిల్లల ఆరోగ్యంపై ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మార్చి నుంచి జూన్ మధ్య ఈ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది శరీరంలోకి వచ్చిన రెండు వారాల తర్వాత కానీ వ్యాధి లక్షణాలు బయటపడవు. దీన్ని ఇన్‌క్యూబేషన్ పీరియడ్ అని పిలుస్తారు. ఆ ఆ తర్వాత వ్యాధి లక్షణాలు బయట కనపడతాయి. ఈ ఇన్ఫెక్షన్ వస్తే ఏడు నుంచి 21 రోజులు వరకు శరీరంలో ఉండే అవకాశం ఉంటుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపించే అంటువ్యాధి.

వ్యాధి లక్షణాలు..

ఆటలమ్మ, గవదబిళ్ల సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం, తీవ్రంగా నీరసించిపోవడం, శరీరంపై నీటి పొక్కులు, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

మూఢ నమ్మకాలను పక్కన పెట్టాలి



వేటపాలెం: ఆటలమ్మ (చికెన్‌పాక్స్) విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు. వేసవి కాలంలో ఇటువంటి వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. వీటి బారిన ఎక్కువగా చిన్నపిల్లలు పడుతుంటారు. ఇది అంటు వ్యాధి. చాలా మంది మూఢ నమ్మకాలతో వైద్యుల వద్దకు పోకుండా సొంత వైద్యం చేస్తుంటారు. అది మంచి పద్ధతి కాదు. నిర్లక్ష్యం చేస్తే కొన్ని సార్లు మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడుతుంది. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

స్వాతికిరణ్, వైద్యాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఈ వ్యాధి సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను పెట్టాలి. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను తాగాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు మందులు వాడాల్సి అవసరం ఉంది. అలాగే పిల్లలకు గోరు వెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

చెత్త సంపద కేంద్రాల నిర్వహణ అధ్వానం



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు

వేటపాలెం: మండల పరిధిలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తీరు అధ్వానంగా ఉందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎస్ఏసీ ప్రాజెక్ట్ మేనేజర్ విజయ్‌శేఖర్‌అన్నారు. గురువారం మండలం పరిధిలోని రామన్నపేటలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఉన్న ఐహెచ్‌హెచ్ఎల్ కమ్యూనిటీ టాయిలెట్‌లు పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ సమావేశం హాల్లో ఏర్పాటు చేసిన సమా వేశంలో వారు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద ఏర్పాటు లక్ష్యం మంచిదైనప్పటికీ ఆయా గ్రామ పంచాయతీ అధికారుల పర్యవేక్షణ అధ్వానంగా ఉందన్నారు. వాటి నిర్వహణ మొక్కుబడిగా ఉంటుందని మా పరిశీలనలో తేలిందన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు వీటిపై శ్రద్ధ తీసుకొని వాటి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎస్ఏసీ జూనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎండీ విజయ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి. సాయికృష్ణ, ఎంపీడీఓ ఎం. రాజేష్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మెరుగైన ఈహెచ్‌ఎస్ విధానం అమలు చేయాలి



బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

చీరాల అర్బన్: మెరుగైన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయాలని, మహిళా కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్ యథావిధిగా అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మెరుగైన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ లీవ్ కమిటేషన్ ఇచ్చి ప్రతి నెలా జీతం ఇవ్వాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళలకు, చైల్డ్ కేర్ లీవ్ ఇచ్చి న్యాయం చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సీసీఎస్ డెలిగేట్ డి.ప్రవీణ్‌కుమార్, డిపో కార్యదర్శి దయాబాబు, డిపో ప్రెసిడెంట్ రవిబాబు, డిపో నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం

చీరాల అర్బన్: అష్టావధానం తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ అని ప్రముఖ అవధానమణి నారాయణం బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక పాపరాజు తోటలోని విశ్వబ్రహ్మణ కమ్యూనిటీ హాల్లో అష్టావధానం సభ గురువారం నిర్వహించారు. పృచ్ఛకులు అడిగిన పలు సాహితీ సమస్యలకు అలవోకగా సమాధానలు చెప్పి ప్రేక్షకులను ఆనందింప చేశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. పృచ్ఛకులుగా గుత్తి విశ్వేశ్వరావు, వడలి రాధాకష్ణ, బత్తుల బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు, బందా వెంకట కృష్ణ శశిధర్, కోట నాగేశ్వరరావు, పణిదపు శివంజనేయ ప్రసాద్, ఏ. నాగవీరభద్రాచారి వ్యవహరించారు.

దివ్యాంగుల సమాఖ్య ఉపయోగించుకోండి



చెక్ అందిస్తున్న ఏపీఎం సుబ్బారావు

చినగంజాం: దివ్యాంగుల అవసరాలను తీర్చడమే దివ్యాంగుల సమాఖ్య ముఖ్య ఉద్దేశం అని వెలుగు ఏపీఎం సుబ్బారావు అన్నారు. మండల దివ్యాంగుల సమాఖ్య సమావేశం గురువారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. గురువారం ఎస్‌కే బాషా అనే దివ్యాంగునికి వాకర్ అందజేశారు. అదే విధంగా రాజుబంగారు పాలెంలోని సాయి దివ్యాంగులు గ్రూపుకు రూ. 1లక్ష స్త్రీనిధి పథకం ద్వారా అందజేశారు. మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షులు మార్పు విశ్రాంతమ్మ, సీసీలు స్వామి, లక్ష్మి, మాధవి, సారధి, వేణు, హనుమంతరావు, అంకిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



పుట్టమరాజు దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈవో, ఎంఈవో

అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈఓ గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యం పెరిగిందని తెలిపారు. తదుపరి మండల విద్యాశాఖ అధికారి బి. సుధాకర్, పాఠశాలకు అనేక విధాలుగా సహకరించిన పుట్టమరాజు శ్రీరామచంద్రమూర్తి దంపతులను సత్కరించారు. శ్రీరామచంద్రమూర్తి.. పెన్నులు నోట్‌బుక్స్‌కు 7500 రూపాయలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎంపీ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ చైర్మన్ గంగాధర్, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రైజింగ్ డే



జెండా వందనం చేస్తున్న కల్నల్, అధికారులు

అద్దంకి: పట్టణంలోని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ మోహనరావు ఆధ్వర్యంలో గా రైజింగ్ డే నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పరమార్ మాట్లాడుతూ విద్యార్థులను రిపబ్లిక్‌డే, థల్ సేవా క్యాంప్, ఎన్‌సీసీ క్యాంపులకు తీసుకువెళతామన్నారు. సుబేదార్ ముఖేశ్ కుమార్, మేజర్ డీఎస్ఆర్‌కే రాజు, హవాల్దార్ కిషన్ కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం



తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పర్చూరు (చినగంజాం): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య చలివేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెళ్లే ప్రజలు, సిబ్బంది కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏ సంఘ ప్రతినిధులు

యద్దనపూడి: వీఆర్‌ఏల సమస్యల న్యాయబద్ధమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం వీఆర్‌ఏ సంఘ ప్రతినిధులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కేవలం 10,500 జీతంతో బతకలేక వీఆర్‌ఏల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అర్హులైన వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పేస్కేలు, ప్రమోషన్లు, నైట్‌డ్యూటీ రద్దు, నామిని వీఆర్‌ఏలగా గుర్తించాలని కోరారు. .

భారత రాజ్యాంగ పీఠిక ప్రజల్లోకి వెళ్లాలి



చినగంజాంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండల శాఖ

చినగంజాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని చినగంజాం అంబేడ్కర్ సెంటర్‌లో భారత రాజ్యాంగ పీఠిక ప్రచార కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఊరూర జనవిజ్ఞానం చినగంజాం మండల శాఖ, ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షుడు మార్కాపురం వెంకట రామారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ పీఠిక లక్ష్యాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా 10 అంశాలైన సర్వసత్తాక, గణతంత్ర, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, ఆదేశిక సూత్రాలు, సామాజిక న్యాయ శాస్త్రీయ ఆలోచన సంఘ సంస్కరణ, ఫెడరలిజం, రాజ్యాంగ స్వతంత్ర సంస్థల పరిరక్షణ తదితర అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళడం నేటి కర్తవ్యం అన్నారు. మరుప్రోలు రత్నారెడ్డి, కార్యదర్శి కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు దేవెళ్ళ వెంకయ్య, మండల కమిటీ సభ్యులు బెల్లం కొండ రమేష్ బాబు, మువ్వల వెంకట సుబ్బారావు, కుక్కల కృష్ణారెడ్డి, మాచవరపు నటరాజ్, పిల్లి శ్రీనివాసరావు, వలివేటి శేఖర్, ఆట్ల అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డకు 1000 రోజుల సంరక్షణ



తనుబొద్దివారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



బబ్బేపల్లి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మ

మార్టూరు: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో 1000 రోజుల సంరక్షణలో తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ద్రోణాదుల సూపర్ వైజర్ కె. పద్మ అన్నారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని బబ్బేపల్లి పడమర ఎస్సీ కాలనీ కేంద్రంలో గురువారం మాట్లాడారు. ప్రసవం అయ్యేవరకు గల మధ్య కాలం 270 రోజులు, బిడ్డ పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వరకు అనగా 730 రోజులు కలిపి మొత్తం వెయ్యి రోజుల ప్రణాళికతో తల్లీ బిడ్డకు సమతుల ఆహారం అందించటం పౌష్టికాహార పక్షోత్సవాల ఉద్దేశం అన్నారు. ఉపాధ్యాయురాలు పి. రమాదేవి, కార్యకర్తలు బి. జీవ కళ, వి. స్వప్న తదితరులు పాల్గొన్నారు. నాగరాజు పల్లి గ్రామంలో సూపర్ వైజర్ టి. శిరీష, కార్యకర్తలు టి. అనుపమ, యు. యశోద, ఎం. సుహాసిని, బి. తిరుపతమ్మ పాల్గొన్నారు.

యద్దనపూడి: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తనుబొద్దివారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బత్తుల కోటేశ్వరావు, అంగన్‌వాడీ సిబ్బంది అనురాధ, అశ్విని, రేవతి, పాల్గొన్నారు.

ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు



ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మోయిన్

చీరాల: ఫైనాన్స్ సిబ్బంది ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ ఎండీ మోయిన్ హెచ్చరించారు. గురువారం స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, మైక్రో ఫైనాన్స్‌ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మైక్రో ఫైనాన్స్ నుంచి డబ్బులు తీసుకొని నగదు చెల్లింపులో కొంత మేర ఆలస్యం అయిన ఖాతాదారుల ఇళ్లకు వెళ్లి ఫైనాన్స్ తీసుకున్న ఖాతాదారులను బెదిరిస్తూ ఒత్తిడికి గురి చేస్తే ఫైనాన్స్ సిబ్బంది, సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరిధిలోనే ఫైనాన్స్ డబ్బులు వసూలు చేసుకోవాలని, నిబంధనలు తప్పితే పోలీస్ చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు, రూరల్ సీఐలు శేషగిరిరావు, ఎస్సై రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా హానిమన్ జయంతి



మాట్లాడుతున్న వైద్యురాలు గాయత్రి

వేటపాలెం: స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయం ప్రాంగణంలో హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ పెడ్రిక్ హానిమన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిచారు. హోమియో వెద్యురాలు ఆత్మకూరి గాయత్రి మాట్లాడుతూ ఈ వైద్యాన్ని ప్రపంచానికి అంకితం చేసిన పితామహుడు జర్మన్ దేశానికి చెందిన హానిమన్ అన్నారు. ప్రస్తుతం ఆధునిక కాలంలో ప్రజలు తినే ఆహారంలో మార్పుల వల్ల అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. ఇంగ్లీషు మందులు ఇతర అవయాలకు హాని కలిగిస్తాయన్నారు. గొల్లపూడి సీతారాం, రిటైర్డ్ ఆర్‌జేడీ ప్రయాగరావు, వీరరాజు, ఆత్మకూరి వెంకట సుబ్బారావు, ఆవుల పునయ్య, కర్ణ సుబ్బారావు, షరీప కొసనం నాగమాంబ, పద్మావతి, గుత్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వైద్య పరికరాల అందజేత



వైద్యశాలకు దాతలు అందించిన పరికరాలతో ఆసుపత్రి సిబ్బంది, దాతలు

ఇంకొల్లు(చినగంజాం): దాతలందించిన సాయాన్ని అందిపుచ్చుకొని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని వైద్యాధికారి డాక్టర్ టి. అంజలి అన్నారు. గురువారం ఆసుపత్రికి దాతలు వైద్యానికి అవసరమైన పరికరాలను అందజేయడంతో దాతలకు ధన్యవాదాలు తెలిపారు. చీమకుర్తికి చెందిన ఏపీ గ్రానైట్ మిడ్‌వెస్ట్ ప్రయివేట్ లిమిటెడ్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో భాగంగా ఆసుపత్రికి కంపెనీ ప్రతినిధి ఏ. శ్రీనివాసరావు, శేషిరెడ్డి పలు వైద్య పరికరాలను, ఫర్నిచర్‌ను గురువారం ఆసుపత్రికి అందజేశారు. బేబీ వార్మర్, బీపీ ఆపరేటర్, వేయింగ్ మిషన్, కంప్యూటర్, చైర్, ఫ్రిజ్, నెబ్యులైజర్, సెక్షన్ ఆపరేటల్ వంటి పలు పరికరాలను వారు అందజేశారు.

కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

అద్దంకి రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కార్మికులకు ఏడు వారాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీఓ శింగయ్యకు వినతి పత్రం అందజేశారు.

బైక్‌ను ఢీ కొన్న కారు

మేదరమెట్ల: గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న బొలేరో వాహనం కొరిశపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే ముందు వెళుతున్న మోటారు బైకును ఢీ కొంది. దీంతో మోటారు బైకుపై ఉన్న ముగ్గురికి గాయాలు కాగా మేదరమెట్ల పోలీసులు అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మద్దిపాడుకు చెందిన విద్యార్థినులు మరో వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

నామినేషన్లు దాఖలు చేసిన న్యాయవాదులు

చీరాల రూరల్ : చీరాల బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి పోటీలో నిలిచిన అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేసినట్లు చీఫ్ ఎన్నికల అధికారి కరేటి రవికుమార్ రెడ్డి తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

జె.పంగులూరు: పంగులూరు మండలంలోని భగవాన్ రాజుపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన డ్రైన్ నిర్మాణ పనులకు అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ రోడ్డుపై మురుగు నీరు పేరుకుపోవడం పై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు గురువారం అప్రోచ్ రోడ్డు వైపు డ్రైన్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు.